# 8

## మహనీయ నర్తకి

ఆ పంచకళ్యాణి కావడానికి మిక్కిలి ఎత్తయిన మేలుజాతి గుర్రమే! చక్కని చిక్కని సుడులున్నదే!

అయినా అది కాశ్మీరాధిపతి లలితాదిత్య చక్రవర్తి నానాడు ముప్పుతిప్పలుపెట్టి మూడుచెరువుల నీళ్ళు తాగించింది. ఎంతెంతటి రౌతులకయినా అది కొంచెమయినా లొంగుబాటుకు రాలేదు! నాలుగైదు దౌడులుతీసి, హఠాత్తుగా వెనకకాళ్ళు రెండు పైకెత్తి, రౌతు నొక్కమారుగా నేలమీదికి విసిరి కొట్టి, కనురెప్పపాటులో ముమ్ముందుకు దూసుకుపోయింది!

అయినా దాని నెలాగో అలాగ లొంగతీసుకు తీరాలన్న పట్టుదలతో, పట్టించి, ఒకచోట నిలిపి, ఒక్కదూకులో జీనుమీదికెక్కి కళ్ళెం చేతబట్టుకుని కూర్చున్నాడు చక్రవర్తి.

కాని ఇల్లలకగానే పండుగవుతుందా? అది మరింతగా అల్లరి మొదలుపెట్టింది. అయినా లలితాదిత్యుడు తన మొండి పట్టుదల విడిచిపెట్టలేదు. దానిని శ్రీనగరానికి బాగా దూరంలోఉన్న ఒక కీకారణ్యం మధ్యంలోనికి పోనిచ్చి అక్కడ సావకాశంగా దారికితేవచ్చునని ఆలోచించి, నెమ్మదిగా అటువైపు కళ్ళెం సడలించాడు. కాని అది అత డనుకున్నంత తేలికగా ఆ అడివి మధ్యలోనికి పోలేదు. చీటికి మాటికి పెడదారులుపట్టి ఎట్టకేలకు ఆనాటి సంజవేళ ఆ అరణ్యం మధ్యలో ఒక పసిరి పచ్చికమైదానంలో ప్రవేశించింది. మరి కొన్ని క్షణాలలోనే తిరిగి అకస్మాత్తుగా ఒక చిన్న దౌడుతీసి ఒక

పొదరింటిమధ్యలో అల్లిబిల్లిగా అల్లుకున్న తీగలలో చిక్కుకుని చెవులు రెండు సూటిగా రిక్కించి అలాగే నిలబడిపోయింది। అత డెన్నివిధాల ప్రయత్నించినా మరి అక్కడినించి కదలలేదు।

అప్పటి కప్పుడే రెండు గడియల రాత్రి గడిచింది. ఆనాడు మాఘపూర్ణిమ. కర్పూరధూళివంటి పొగమంచుతోబాటు, తెల్లని పాలనురుగు తుంపరవంటి పండువెన్నెల ఆ అడివి అంతా ముంచె త్తింది. సార్వభౌము డా అటవీ సౌందర్యంఅంతా నాలుగయిదు క్షణాలపాటు కళ్ళ దోసిళ్ళతో జుర్రుకున్నాడు.

అంతలోనే అతనిని మైమరిపించి పులకింపజేసే మనోజ్ఞగాత్ర సంగీతం వినిపించింది. అది ఆలకిస్తూ లలితాదిత్యు డలాగే ప్రాన్పడి పోయాడు.

'ఈ మహారణ్యంలో, ఎక్కడినించి వస్తూం దీ మనోహర సంగీతం? ఇది ఏదయినా కలా? లేక భ్రమా? లేక యథార్థమేనా?' క్షణకాలం విభ్రాంతపడ్డాడు.

ఆపైన తనతోబాటు పంచకళ్యాణికూడా చెవులు రిక్కించి వింటున్నట్టు పసికట్టాడు. దాని నక్కడే ఆ పొదరింటిలో బలమయిన తీగలమోకుతో ఒక చెట్టుకి కట్టివేసి, ఆ గానం వినవచ్చినవైపు మరి కొంతదూరం ముమ్ముందుకు సాగిపోయాడు.

అక్కడ ఒక ఎత్తయిన మట్టిగుట్ట కెదురుగా నిలిచి ఒక అవ్వని కాలిఅందెల ఘలంఘల ధ్వనితో, కరకంకణాల గలగలతో, జవ జవలాడుతున్న నెన్నడుముతో గోపికాగీతిక ఏదో గొంతెత్తి ఆలాపిస్తున్నది. లలిత లలితంగా నృత్యం కొనసాగిస్తున్నది. ఆమె కిరుపైపుల కూర్చున్న యువతులలో ఒకతె పాటతో మేళవించి వీణ వాయిస్తున్నది. వేరొకతె మురళి మ్రోగిస్తున్నది. వెనకవైపున కూర్చున్న ఇంకొకసుందరి మంద్రమంద్రంగా మృదంగం ధ్వనింప జేస్తున్నది.

ఆ మహాద్భుత దృశ్యం గమనించిన చక్రవర్తి మరికొన్ని క్షణాలవరకు తాను చూస్తున్నది యథార్థమే అని నమ్మలేకపోయాడు. ఇంకా కొంత సేపలాగే ఆ పొదరింట పొంచిఉండి ఆ అపూర్వనృత్యం

సందర్శించాడు.

అప్పుడే పితికిన పాలవంటి ఆ నర్తకి శరీరచ్ఛాయ ముప్పేట ముత్యాలహారాలకదలికల తెల్లని తళతళలలో శేటవెన్నెలలో కరిగిపో తున్నట్టు మెరిసింది. ఇంచుమించుగా ఇరవై అయిదేళ్ళ వయస్సులో ఉన్నట్టు స్ఫురిస్తున్న ఆ యౌవనవతి ముంగురుల కదలికలతోపాటు కర్ణాభరణా లటు ఇటు చెంగలిస్తున్నాయి. పాపిట ముత్యాల మాలి కతోబాటు పాము కుబుసంవంటి పైట ముమ్మందు కురుకుతున్నది. ఆమె బంగారు కరకంకణాల కదలిక అతని నిండుగుండెలో చిరు మెరుపు లుదయింపజేసింది:

"ఎవ్వ రీ అతిలోక సౌందర్యవతి? ఈ నిర్జనారణ్యంలో ఇంతటి రాత్రివేళ ఆ మట్టిగుంట కెదురుగా నిలిచి నృత్యం చెయ్యడాని కేమిటి కారణము? వీణతో, మురళితో, మృదంగంతో ఆ సుందరి ననుసరిస్తున్న ఆ మదవతులు మువ్వురు ఎవ్వరు?"

తేనెపట్టునుండి వెలువడిన తేనెటీగలు ఝుంఝుమ్మన్నట్టు లలి తాదిత్యుని మనస్సులో తియ్య తియ్యని ఆలోచన లెన్నెన్నో చిందులు దొక్కాయి.

ఆ విధంగా ఒక అరగడియ గడిచినంతలోనే ఆ మహిళ లందరు తమ నృత్యగోష్ఠి ముగించుకుని ఆ మట్టిగుట్ట వెనకవైపు పోయి క్రమక్రమంగా అదృశ్యులయినారు.

కాశ్మీరాధిపతి ఒక సుదీర్ఘ నిశ్వాసం విడిచిపెట్టాడు. ఆ నర్తకి నృత్యధ్వని ఇంకా అతని హృదయంలో ధింధిమ్మని మారుమ్రోగు తూనే ఉన్నది. కొంచెం పరధ్యానంగా తన పంచకళ్యాణి కట్టువిప్పి నెమ్మదిగా దానిమీదికి లంఘించి అరచేతితో అదిలించాడు.

ఆమె మోహనగానగోష్ఠి ముగిసిపోయినందువల్లనే కాబోలు, అదిఅంతగా తికమక పెట్టకుండానే అతిత్వరితంగా శ్రీనగరానికి మరలి పోయింది. ఆపైన ఆ మరునాటికే అది లలితాదిత్యునికి బాగా మచ్చిక అయింది.

అలాగ క్రమక్రమంగా అయిదారురోజులపాటు ప్రతి సాయం కాలము కాశ్మీర చక్రవర్తి ఆ పంచకళ్యాణిమీద ఆ దుర్గమారణ్యా

మధ్యంలో ఆ నర్తకి రమణీయనృత్యం విశ్చలనేత్రాలతో తిలకించాడు. అప్పటినించి అతని మనస్సులో ఆ నర్తకినిగురించి విపరీతమయిన జిజ్ఞాస, ఆత్రత బయలుదేరాయి.

ఆ సుందరు లెవ్వరో, వారి పుట్టుపూర్వోత్తరా లేవో అతని కప్పటికి కూడా తెలలేదు. వేగులవారందరు ఆ జటిలాటవివైపే తా మెన్నడు పోలేదని చెప్పి తమ అజ్ఞానం బయట పెట్టుకున్నారు. లలితాదిత్యుని కేమి పాలుపోలేదు. ఆ మరునాటి సాయంకాలం తానే ఆ నర్తకి నడిగి, ఆ విచిత్ర నృత్యరహస్యం కనిపెట్టి తీరాలని విశ్చయించుకున్నాడు.

ఆమరునాటి సూర్యాస్తమయ సమయానికే మాఘసంధ్యాకాంతి పచ్చని పచ్చికల చిగుళ్ళపై క్షణకాలం మేనువాల్చి విశ్రమించింది. చిన్నచిన్న మంచుబిందువు లా కాంతిలో చిన్నారి పద్మరాగాలై తళ తళించాయి. అప్పటికే ఆ ప్రాంతంలో సన్నని కీచురాళ్ళ మోత వినబడీ వినబడనట్టు ప్రారంభమయింది.

అంతలోనే ఆ సుందరు లందరు అక్కడికి వచ్చి తమ నృత్య గోష్ఠి ప్రారంభించారు. ఎర్రని సంజ వెలుగు పడిన వారి ముఖాలు సార్వభౌమునికొక వినూతనరక్తిమతో సాక్షాత్కరించాయి. ఆ నర్తకి గళం చలవరాతి పలకల మీది కురుకుతున్న సెలయేటి చిరు కెరటాల సవ్వడిలా అతిలోక మాధుర్యంతో అరణ్యంలో కొండలలో కోనలలో నలుమూలల ప్రతిధ్వనించింది. మరి కొంతసేపటికి పలచపలచని చీకటి తరు లతల గుబురులలో చిక్కుపడుతున్నట్టు పొడకట్టింది.

మరి కొన్ని క్షణాలలోనే ఆ నర్తకి నృత్యం ముగిసింది. అంతలోనే లలితాదిత్యుడా పొదరింటి నుండి బయటపడి నవ్వు ముఖంతో నెమ్మదిగా వారిని సమీపించాడు.

అతని నల్లంత దూరంలో చూస్తూనే వారందరు తమ శిరస్సులపై దోసిళులుంచుకుని "జయ! కాశ్మీర సార్వభౌమా! జయ!" అని అభినందించి తమ నేల ఏలిక ఎడల ప్రగాఢ ప్రభు భక్తి వెల్లడించుకున్నారు. లలితాదిత్యుని నేత్రాలలో అచ్చెరువు మరింతగా గూడు

కట్టుకున్నది. తనసంగతి వారి కంతకుమునుపే తెలిసి ఉండవచ్చునని గ్రహించుకుని నెమ్మదిగా అడిగాడు.

"మీ రెవ్వరు? ఈ నిర్జనారణ్యంలో ఈ మట్టి గుట్ట కెదురుగా నిలిచి ఎందు కిలాగ నృత్య గోష్ఠి జరుపుతున్నారు?"

వారిలో నర్తకి అలతి నగవుతో తమ వృత్తాంతం ప్రారంభించింది.

ఆమె పేరు నాగ సుందరి. ఇక మిగిలిన యువతులందరు ఆమె వేలు విడిచిన చెల్లెళ్ళు. వారి కందరికి నృత్య సంగీతాది విద్య లన్ని దేవదాసీ కులాన్ని బట్టి చిన్ననాటి నించి అలవడ్డాయి! వారి కెదురుగా ఉన్న ఆ పెద్ద మట్టి గుట్ట దిగువ బహు పురాతనములయిన దేవళాలు మూడు భూగర్భంలో కూరుకు పోయాయి.

ఆ మట్టి గుట్ట కుత్తరంగా సుమారొక క్రోశం దూరంలో శూరవర్ధనమన్న పెద్ద గ్రామ మొకటి ఉన్నది. ఆ గ్రామమే వారి నివాస స్థలం. వా రా పల్లెలో ఆ దేవళాలకు సంబంధించిన మడి మాన్యాలన్ని చాలా కాలంనించి వంశానుగతంగా అనుభవిస్తున్నారు.

బహు ప్రాచీన కాలంలో ఒకప్పుడు అక్కడి భూమి పెద్దగా కంపించినందువల్ల ఆ దేవళాలన్ని చాలావరకు నేల లోపలికి కూరుకు పోయాయని వారి తాతముత్తాతల కాలంనించి క్రమక్రమంగా వినవస్తున్నది. కనుకనే ప్రతి సాయంకాలం వారందరు తమ నృత్య గోష్ఠులతో భూగర్భంలో ఆ దేవళాల దైవతాల కావిధంగా సాయం కాల పూజ లాచరిస్తున్నారు. అదే వృత్తాంతం సంగ్రహంగా నాగ సుందరి చక్రవర్తి చెవిని వేసింది.

అయినా అత డది అంత గట్టిగా నమ్మలేక పోయాడు.

"అయితే ఈ పెద్ద మట్టి గుట్ట దిగువ దేవళాలు మూడు దిగ బడిపోయిన మాట యథార్థమేనా?"

మిక్కిలి అడకువతో తలవంచుకున్న నాగసుందరి పెదవులపై చిరునవ్వు చెక్కిళ్ళతో దోబూచు లాడింది.

ఏలినవారి సముఖంలో మే మసత్యం చెప్పగలమా? ఎన్నో తరాలనించి మా గ్రామంలో ఆ దేవళాల మడిమాన్యాలన్ని మేమనుభ

విస్తున్నాము. ఇంతేకాదు. అల్లదిగో, ఆ సెలఏటి ఒడ్డున కానవస్తున్న పర్వత గుహలో తపస్సు చేసుకుంటున్న వృద్ధ తపస్వి ప్రవాళ స్వామి కూడా ఇదే సంగతి సెలవిస్తున్నారు. మా మాట మీద నమ్మిక కలగకపోతే, తిన్నగా అక్కడికి వెళ్ళి, మీరే వారినడిగి ఈ సందేహం తీర్చుకోవచ్చును. సరిగదా!"

నాగసుందరి పెదవిపై చిరునవ్వు అలాగే నిశ్చలంగా నిలిచి వెలిగింది. అంతలోనే లలితాదిత్యు డందుకున్నాడు:

"నీ వసత్యం చెప్పావని కాదు! ఈ మట్టి గుట్ట కింద మూడు దేవాలయాలు పాతుకుపోయాయంటే నా కెందుచేతనో నమ్మకం కల గడంలేదు."

"ఆ మట్టి గుట్ట లోతుగా తవ్వించిన పక్షంలో మీకే మా మాటల నిజానిజాలు తెలిసి రాగలవుగదా! ఆ విధంగా ఒక మారు పరిశీలించరాదా? ఈ మాత్రాని కింత మథన ఏల?....మరి నేటికి మా కింక సెలవు దయచేయించ ప్రార్థన."

కాని అతని కా సంభాషణ అంతటితో ముగించడం రుచించ లేదు! ఆలాగే ఆ సౌందర్యనిధితో సరస సల్లాప గోష్ఠి కొనసాగిస్తూ ఆరాత్రి అంతా అక్కడే గడిపివేస్తే బాగుండునని ఉవ్విళ్ళూరి పోయాడు. చనువుగా కొంచెం దగ్గిరిగా వెళ్ళి నెమ్మదిగా అడిగాడు:

"సరే నీవు చెప్పినట్టే చెయ్యవచ్చునుగాని. నేను చక్రవర్తి నని నీ కెలాగ తెలిసింది?"

ఆమె కనురెప్పలు సోగగా వంచింది. చెక్కిళ్ళు చూచాయగా ఎర్రబడ్డాయి. అప్పుడే వికసించిన నాగసుందరి పెదవిపై తిరిగి అదే చిరునవ్వు!

"సార్వభౌమా! పొద్దుపొడిచిన పిమ్మట 'అదుగో వెలుగుల రేడు!' అని వేలెత్తి చూపించవలిసిన అవసరం లేదు గదా....అదీ కాక తామప్పుడప్పుడు ఈ ప్రాంతానికి వేట వేడుక కోసం విచ్చె య్యడం మా కందరికి ఎరుకపడిన విషయమే!"

నును సిగ్గుతో వాలిన ఆ నర్తకి కనుదోయిని ఒక్కమారు తనివిదీరా ముద్దు పెట్టుకోవాలన్న అభిలాష కలిగింది చక్రవర్తికి.

కాని అత డా భావం పెదవులలోనే నిగ్రహించుకున్నాడు.

"ఓహో! ఆలాగా, అయితే నే నప్పుడప్పుడు ఇక్కడికివచ్చి మీ నృత్యోత్సవంతో కన్నుల పండువు చేసుకోవచ్చునా?"

నాగసుందరి మరింతగా సిగ్గుపడి రవంత కుంచించుకు పోయింది.

"ఏలిన వా రింత శ్రమపడి ఇక్కడికి విచ్చేయ్యగల మనడం కన్న మా కింక వేరే కోరుకోవలిసిన మహాభాగ్యం ఏమి ఉన్నది? ఇది తమ ఆదరణకే తార్కాణం."

ఆమె అంజలి ఘటించింది. పంచకళ్యాణి మీద చక్రవర్తి తిరిగి తన రాజధానికి బయలుదేరాడు. అతని దగ్గిర సెలవు తీసుకుని వారందరు తిరిగి శూర వర్ధన గ్రామానికి తరలిపోయారు.

* * *

ఆనాటినించి అయిదారు రోజులపాటు ప్రతిసాయంకాలము తప్పకుండావచ్చి, నాగసుందరి నృత్యారాధన సందర్శించాడు సార్వభౌముడు. ఆమె ఆ నృత్య పూజాసమయంలో వెలువరించే వెన్నెల పువ్వువంటి నిర్మలదరహసితంతో క్రమక్రమంగా అతని హృదయం తన్మయమయింది.

అంతకుమునుపు తన అంతఃపురంలో మద్యపానంతో మైమరిచిన నర్తకీమణుల చిరునవ్వు లెన్నోమారులు పరిశీలించాడు చక్రవర్తి. కాని వా రెవ్వరి దరహసితాలలోను అంతటి అతిలోక సౌందర్య మెన్నడు స్ఫురించలేదు! మంకెన పువ్వువంటి నాగసుందరి పెదవిపై పారిజాతంవంటి ఆచిరునవ్వు అతని నెల్లవేళల వెన్నాడింది. శుద్ధస్ఫటికంవంటి ఆమె నెమ్మేనిచాయ అతనికి మరింతగా మత్తెక్కించింది. 'ఆహా! ఎంతటి అతిలోక సౌందర్యము! ఆ జవ్వనిని బిగికౌగిలింతతో పట్టి బంధించే భాగ్యం నా కెన్నటికయినా లభించగలదా?'

ఆ అరణ్యమధ్యంలో భూతలం లోలోపలికి కూరుకుపోయిన ఆ దేవళాల సంగతి జ్ఞప్తికిరాగానే అతని కెంతయినా ఆశ్చర్యం కలిగింది. 'ఆ వార్త నిజమేనా? లేక పాతకాలంనాటి కాతల పుక్కిటి పురాణమా?' అని ఆలోచించాడు.

ఏది ఏమయినా ఆవృద్ధతపస్వి ప్రవాళస్వామి నొకమారు సంద ర్శించి. ఆ సందేహం పూర్తిగా తొలగించుకోవాలని నిశ్చయించు కున్నాడు.

మరునాటి సాయంకాలం నాగసుందరి నృత్యసందర్శనంతో కలిగిన పారవశ్యంతో తడబడుతున్న అడుగులతో నెమ్మదిగా ఆ సెలయేరు దాటాడు లలితాదిత్యుడు. ఆ ప్రాంతంలో పర్వతగుహలో నిశ్చలధ్యానంతో కనుదోయి ముకుళించిన ఆ తపోనిధి కెదురుగా నిలిచి చేతులు రెండు జోడించి నిశ్చల శిలామూర్తిలా నిలుచున్నాడు. ప్రవాళస్వామి మరికొంత సేపటికి తన ధ్యాననిష్ఠ ముగించి. చక్రవర్తి వైపు చూచి చిక్కని మందహాసం మాత్రమే వెలువరించాడు.

లలితాదిత్యుడు ముమ్మందుగా నాగసుందరిద్వారా విన్న వృత్తాంతం నివేదించి మిక్కిలి అడకువతో ప్రశ్నించాడు.

"స్వామీః ఆ మట్టిగుట్ట దిగువ భూమి లోలోపల మూడు దేవాగారాలు కూరుకుపోయిన మాట యథార్థమేనాః"

'అవునుః అది యథార్థమే' అన్నట్టు తలపంకించాడు మౌని. అంతేగాని పెదవి కదిపి మాట్లాడలేదు. ప్రవాళస్వామి మౌననిష్ఠ స్వీకరించి ఉండవచ్చునని గ్రహించుకున్నాడు చక్రవర్తి. సవిన యంగా భూమిపై సాగిలపడి నమస్కరించి తొణికిసలాడుతున్న అడకువతో వీడ్కొన్నాడు.

మరునాటి ఉదయమే వేలకొలది పనివారి నేర్పాటుచేసి అరణ్యమధ్యంలో ఆ మట్టిగుంటఅంతా పూర్తిగా లోలోపలికి తవ్వించాడు. క్రమక్రమంగా పెద్దపెద్ద మండపాలతో. నృత్యాలయాలతో. గర్భగృహాలతో దేవళాలు మూడు బయటపడ్డాయి.నాగసుందరి.ప్రవాళ స్వామి చెప్పినవన్ని అక్షరాల యథార్థా లయ్యాయని చక్రవర్తి సంతోషపారవశ్యంతో ఉప్పొంగిపోయాడు.

ఆవిధంగా బయటపడిన దేవాలయాలలో మొదటివి రెండు రామలక్ష్మణుల దేవళాలు. మూడవది గోపాలకృష్ణ దేవునిది. ఆ దేవా గారాలన్నిటిలోను మూల విరాట్టు లలాగే చెక్కుచెదరకుండా నిలిచి ఉన్నాయి. కాని మిగిలిన శిల్పాలలో చాలావరకు శిథిలాలుగా

మాత్రమే మిగిలాయి. కాని కొన్నికొన్ని గోడలమీది చిత్తరువు లెక్కడ చెక్కుచెదరలేదు! అయితే అవి ఏ కాలంనాటివో వెల్లడించ గల తామ్రశాసనాలు కాని, దాన శిలాఫలకాలుకాని చక్రవర్తి కెక్కడ పొడకట్టలేదు. అవి అన్ని అత్యంత పురాతనమయిన కాలగర్భంలో కలిసిపోయి ఉండవచ్చునని ఊహించుకునిఉసూరుమని నిశ్వసించాడు.

ఆ ప్రాచీనకాలంలో ఎందరెందరక్కడికి వచ్చి, పూజాదు లావరించి, భక్తి తన్మయతతో పరవశించారో! ఎందరెందరు నట్టువ రాండ్రు నృత్య మంటపాలలో తమ మనోజ్ఞ భంగిమలతో ప్రేక్ష కుల నుత్రూత లూగించారో! ఆ దేవాలయాల ప్రాంగణాలలో ఎన్నెన్ని కల్యాణ మహోత్సవా లపూర్వ వైభవంతో జరిగాయో! వా రందరు ఏమయిపోయారు! వారివారి ఆనందావేశాలు, సుఖదుఃఖాలు, అహంకారాలు, ఆత్రతలు, ఆప్యాయతలు, అన్యోన్యతలు—అన్ని ఏమయిపోయాయి? ఆ దేవళాల గోడలమీది వేర్వేరు రంగురంగుల చిత్రా లతనివైపు చూచి, చిరునవ్వులతో గుర్తిస్తున్నట్టు స్ఫురిం చాయి. 'ఆహా! జీవితలీల ఎంత క్షణికమయినది! గతకాలం క్షణ మయినా మరి తిరిగిరాదు గదా!' ఉసూరుమని నిట్టూర్చాడు చక్రవర్తి.

అటుపిమ్మట రామలక్ష్మణ విగ్రహాలలో మొదటిది కాశ్మీ రంలో సుప్రసిద్ధమయిన పరిహాస కేశవదేవాలయంలోను, వేరొకటి చక్రేశ్వర క్షేత్రంలోను ప్రతిష్ఠింపజేయించాడు లలితాదిత్యుడు. ఇక గోపాలకదేవుని ప్రతిమ సంగతి కొంచెం నెమ్మదిమీద నిర్ణయించ వచ్చునని తీర్మానించుకున్నాడు.

ఆ మరునాడు కొంచెం చల్లబడగానే గోపాలదేవుని గర్భాల యంలో ప్రవేశించాడు. నీరెండపడి తళతళలాడుతున్న గోపికల జల క్రీడల చిత్రా లతని కన్నుల కొక్కమారుగా మిరుమిట్లు కలిగిం చాయి. ఆ చిత్రాలమీదుగా పాము కుబుసాలు రెండు ఏటవాలుగా వ్రేలాడుతున్నాయి. గోపాలక ప్రతిమ వెనుకభాగంనుండి ముంగిస ఒకటి తటాలున వేరొకచోటికి పారిపోయింది. మురళిపై అంగుళులు మోపిన ఆ మూర్తి నీరవసంగీతం గర్భాలయంలోనేకాక నలుమూలల వ్యాపిస్తున్నట్టు స్ఫురించింది. లలితాదిత్యు డా మూర్తి శిల్పసౌందర్యం

గమనించి తన్ను తానే మరిచి అలాగే నిలుచుండిపోయాడు.

మరికొంతసేపటికి గలగలమని అందెల సవ్వడి వినబడింది. అదిరిపడి తటాలున వెనుదిరిగి చూచాడు చక్రవర్తి. అంతలోనే నాగ సుందరి మందగమనంతో లోపలికి వచ్చి, గోపాలమూర్తి పాదాలపై వాలి, ప్రగాఢంగా కౌగలించుకుని వేడివేడి కన్నీటితో ముంచెత్తింది. తలవని తలంపుగా జరిగిన ఆ సంఘటనతో మరింతగా విస్తుపోయాడు చక్రవర్తి.

"ఇదేమిటి నాగసుందరీ. రామలక్ష్మణ దేవరలుండగా వెన్న దొంగమీద నీ కింతటి విపరీతమయిన భక్తి కలిగింది?"

కొంచెం కొంటెగా నవ్వుతూ కవ్వించాడు చక్రవర్తి. నాగ సుందరికూడా రవంత నవ్వుతూనే ప్రతిసమాధానం చెప్పింది.

"ఈ నవనీతచోరుడే నా హృదయం దొంగిలించాడు! మహా ప్రభూ! ఈనాటికి నా పూర్వజన్మ పుణ్యం పూర్తిగా ఫలించింది. ఈ గోపాలకమూర్తి సాక్షాత్కారం కోసమే నే నిన్నాళ్ళనుండి నృత్యంతో నిత్యపూజ జరుపుకుంటున్నాను. ఇక నా కింతకన్న కోరుకోవలిసిన దేమిలేదు."

"అలాగా! అయితే నే నీ మూర్తిని శ్రీనగరంలో నిర్మించిన వేరొక దేవళంలో ప్రతిష్ఠించాలని అనుకుంటున్నానే!"

చక్రవర్తి కొంత అస్పష్టంగా తన ఆలోచన బయటపెట్టాడు. కాని అంతమాత్రానికే నాగసుందరి అదిరిపడింది.

"ఏలినవారికి నా దొక్క విజ్ఞప్తి."

"ఏమది?" అన్నట్టు లోతుగా కనుబొమలు కుంచించాడు చక్రవర్తి.

"ఈ ప్రతిమ ఇక్కడినించి కదిలించవద్దని ప్రార్థన."

"అయితే ఈదైవతానికి పూజాపునస్కారాలెలాగజరుగుతాయి?"

"ఏదో విధంగా నేనవి ఇక్కడే యథావిధిగా జరుపుకో గలను. కొంచెం నామాట మన్నించండి!"

"ఎందుచేత నీ కీ మూర్తిమీద అంతటి భక్తిప్రపత్తులు కలి గాయి నాగసుందరీ!....నేను కొంచెం వినవచ్చునా?"

ఆమె రవంతసేపు తటపటాయించింది.

"ఇది నాకెంతో ఆత్మీయమయిన రహస్యం. అయినా ఈ సుందరమూర్తిని భూగర్భంనించి వెలువరించి, సాక్షాత్కరింప జేయించిన మీకు నే నెంతయినా ఋణపడిఉన్నాను. ఇందువల్ల మీ దగ్గిర నే నేమీ దాచదలుచుకోలేదు. నిశ్చల భక్తితో ప్రతిదినము కొలుచుకుంటే నా ఆరాధ్యదైవతం గోపాలకమూర్తి తప్పక సాక్షాత్కరించగలరని ప్రవాళస్వామి నా కాదేశించారు కనకనే ఇంచుమించుగా ఏడెనిమిదేళ్ళనుండి నే నిలాగే సేవించుకుంటున్నాను. ఈ మహనీయ భాగ్యం నాకు మీవల్లనే లభించింది! కనకనే ఈ ప్రతిమ ఇక్కడినించి తరలించవద్దని వేడుకుంటున్నాను. నా మనవి రవంత చిత్తగించండి!"

చక్రవర్తి మరికొంతసేపటివరకు నాగసుందరి ముఖవైఖరి రెప్పవాల్చకుండా పరిశీలించి నవ్వుముఖంతో తన ఆలోచన బయట పెట్టాడు.

"సరే, నీవు కోరినట్టే చేస్తానులే....అయితే నాగసుందరీ, నీవు నా కింతగా ఋణపడి ఉన్నావు కదా! మరి నా ప్రతిఫలం మాటేమిటి?"

నాగసుందరి క్షణకాలం సర్దాంతపడింది.

"మీవంటి మహైశ్వర్యవంతులకు నే నేమి సమర్పించుకో గలను మహాప్రభూ!"

"సమర్పించుకోగలిగినదే సమర్పించవచ్చును! దానికేమి?"

నాగసుందరి రవంతసే పాలోచించి లీలగా నవ్వింది.

"అయితే తమ సెలవేమిటి?"

"మరి కాదనకుండా తప్పక నెరవేర్చాలి సుమా!"

"ఎంతమాట! ఏదో రూపంలో తమ ఋణం తీర్చుకోగల మహదవకాశం చేతులారా జారవిడుచుకుంటానా?"

"నిశ్చయమేనా?"

"నిశ్చయమే!....ముమ్మాటికి నిశ్చయమే!"

"అయితే నేటిరాత్రి దీనినిగూర్చి బాగా ఆలోచించుకో! తిరిగి

రేపు ఇదేవేళ ఇక్కడికి వచ్చి. నా కోరిక వెల్లడిస్తాను. మరి నేను వెళుతున్నాను!"

వెనుదిరిగాడు లలితాదిత్యుడు. "చిత్తం అలాగే" అని మరి కొంత దూరంవరకు అతని ననుసరించింది నాగసుందరి. పంచ కళ్యాణిమీద తిరిగి శ్రీనగరుకి తరలిపోయాడు లలితాదిత్యుడు.

* * *

తాను వాగ్దానం చేసినట్లు ఆ మరునాటి సాయంకాలానికి అరణ్యమధ్యంలోఉన్న గోపాలకృష్ణ దేవాలయానికి పోలేదు లలితా దిత్యుడు. అతనికి బదులుగా వేలకొలది దేవాలయ శిల్పులు, పనివారు అక్కడికి వచ్చి ఆ గోపాలదేవాగారం పునర్నిర్మాణం ప్రారంభిం చారు. దానినిబట్టి చక్రవర్తి తనకోసమని అక్కడే తిరిగి ఆ దేవళం నిర్మింపజేయిస్తున్నారని గ్రహించుకుని ఎంతో సంతోషించింది నాగ సుందరి. ఆ సమయంలోకూడా ఒక్కనాడు ఆమె తన సాయంకాల నృత్యారాధన విరమించలేదు. వీలయినంతవరకు యథాశక్తిగా ఆ నృత్యపూజ కొనసాగించింది. అలాగ మరి రెండు మూడు నెలల లోనే ప్రాకారాలతో, గోపురాలతో, నృత్య మంటపాలతో కళ్యాణ శాలలతో ఆ దేవాలయనిర్మాణం పూర్తి అయింది. చిట్టచివరికొక శుభముహూర్తంలో దేవాలయ సంప్రోక్షణంకూడా యథావిధిగా ముగిసిపోయింది. అంతవరకు ఒక్కనాడుకూడా అటువైపు పోలేదు చక్రవర్తి.

కాని అతని హృదయం నాగసుందరి నృత్యంతో, సౌంద ర్యంతో అనుక్షణము పరవశించింది. గోపాలకదేవాలయంనించి తిరిగివచ్చినప్పటినించి అతని కంటికొక్క కునుకయినా పట్టలేదు.

అయితే అంతరాంతరం మారుమూలలలో అతన్ని ఒకే ఒక్క సంశయం పట్టుకుని వేధించింది. నాగసుందరి అతని కోరిక తప్పక నెరవేర్చగలనని గట్టిగా మాట ఇచ్చింది. కాని అతని కెందుచేతనో 'ఆమె తనమాట నిలబెట్టుకోగలదా?' అని చిన్న సందేహం పట్టుకుని వేధించసాగింది. కనుకనే వేలకొలది శిల్పుల నేర్పాటు చేయించి, గోపాలకృష్ణదేవాలయం ప్రాచీన దేవళంకన్న మరింత "గొప్పగా

నిర్మించవలసిందని ఆజ్ఞాపించాడు. సంప్రోక్షణ మహోత్సవంనాడు నాగసుందరి మరింత మహనీయంగా నృత్యం చేసిందని విన్న పిమ్మట అత డా మరునాడే ఆ దేవళాని కొకమారు పోవాలని ఉవ్విళ్ళూరాడు.

తిరిగి ఆనాటిరాత్రి అతని కామెచిరునవ్వు జ్ఞప్తికి వచ్చింది. అంతటి సొగసయిన చిరునవ్వు అంతకు ముడు పెన్నడు సందర్శించ లేదని అనుకున్నాడు సార్వభౌముడు. అయితే ఆమె అపూర్వ సౌంద ర్యంవల్ల ఆ దరహసితాని కంతటి లాలిత్యం వచ్చినదని సరిపెట్టు కున్నాడు. ఆనాటి వేకువజామున అతని కొక కల వచ్చింది. నాగ సుందరి నాతడు తన బిగికౌగిలిలో బంధించాడు. కాని అంతలోనే ఆమె అతని గాఢాలింగనంనుండి తప్పించుకుని క్షణంలో అదృశ్యురా లయింది! ఆ కల కర్థమేమో అతనికి బోధపడలేదు. అప్పటినించి అరణ్యమధ్యంలో ప్రవేశించేవరకు లలితాదిత్యునికి ఒక్కొక్కలిప్త ఒక్కొక్క యుగంలా గడుస్తున్న ట్టనిపించింది.

అయినా అతి కష్టంమీద మనస్సు నిగ్రహించుకుని సాయం సమయానికి గోపాలకృష్ణ దేవాలయం నృత్య మంటపంలో ప్రవే శించాడు.

అప్పటికప్పుడే ఆ దేవుని కెదురుగా నిర్మించిన మనోహర నృత్యశాలలో నాగసుందరి నృత్యం కొనసాగుతున్నది. మిగిలిన ఆమె చెల్లెళ్ళందరు ఇనుమడించిన ఉత్సాహాలతో మురళితో, వీణతో, మృదంగంతో ఆమె ననుసరిస్తున్నారు. ఆనాటి నాగసుందరి నృత్యాధి నివేశం చక్రవర్తి కంతకుమునుపుకన్న మరింతగా మైమరుపు కలిగిం చింది. అందులోను అపూర్వలాస్యావేశంతో తన్మయురాలయిన ఆమె అరమోడ్పు కన్నుగవ, మౌక్తికంవంటి చిరునవ్వు మరింతగా సమ్మోహింపజేశాయి.

నృత్యం ముగియగానే నాగసుందరి శిలతో చెక్కిన సింహా సనంపై కూర్చున్న చక్రవర్తి సన్నిధికి వచ్చి దోసిలికట్టి. ఉరకలు వేస్తున్న ఉత్సాహంతో తన కృతజ్ఞత వెల్లడించుకున్నది.

"ఔదార్యమూర్తీ. తమ రిక్కడినించి నా దైవం ప్రతిమ

తరలించలేదు సరిగదా, పైగా అనతికాలంలోనే స్వామికొక దివ్య దేవాలయం నిర్మింపజేయించారు। మీ వితరణ నే నేమని వినుతించ గలను। ఎన్ని జన్మలకయినా మీకు నే నెల్లప్పుడు ఋణగ్రస్తురాలినే। ఇది నేనేవిధంగా తీర్చుకోగలనో తెలియక తికమకపడుతున్నాను."

"దీనికి నీ వంతగా మథనపడనక్కరలేదు. నీ విచ్చిన వాగ్దానం నెరవేర్చుకున్న పక్షంలో తిరిగి నేనే నీకు ఋణపడి ఉంటాను। తెలిసిందా?"

చక్రవర్తి మనస్సు ఉత్సాహంతో ఉరకలు వేసింది. అయితే అతని ఆంతర్యమేమో అంతవరకు విస్పష్టంగా నాగసుందరి కవగాహన కాలేదు. రవంత అమాయకంగా ముఖంపెట్టింది.

"నీ విచ్చిన వాగ్దానంమాట అప్పుడే మరిచిపోయావా?" చక్రవర్తి సూటిగా ప్రశ్నించాడు.

ఏదో గుర్తువచ్చినట్టు తటాలున ఉలిక్కిపడింది నాగసుందరి.

"లేదు। లేదు। ఇంతకి తమ సెల వేమిటి?"

"నిజానికి నీవు నా రాణివాసంలో ఉండదగిన అపూర్వ సౌందర్యవతివి। ఇదే నా కోరిక।" చక్రవర్తి ఆమెవైపు రెప్ప వాల్చక చూస్తూ అన్నాడు. నాగసుందరి రవంత అదిరిపడింది.

"మహాప్రభూ! తా మీవిధంగా కోరగలరని నేను కలలో కూడా ఊహించలేదు. మీ రాణివాస మెక్కడ? నే నెక్కడ? నే నీ గౌరవాని కెంతమాత్రము తగను। నా వృత్తాంతం రవంత తెలిసి ఉంటే తా మీ విధంగా కోరిఉండరు. నన్ను మన్నించక తప్పదు."

"ఏం, ఎందుచేత? ఆ వృత్తాంత మేమిటి?"

నాగసుందరి కనురెప్పలు పూర్తిగా వాల్చివేసి స్వకీయగాథ ప్రారంభించింది.

* * *

ఆమె ఇంచుమించుగా ఏడెనిమిదేళ్ళ క్రితమే ఆ మంటిగుట్ట కెదురుగా ప్రతిదినము యథాప్రకారంగా నృత్యం కొనసాగిస్తున్నది. ఒకనాటి సంజవేళ ఆమెకత్యంత సమ్మోహకమయిన మురళీ సంగీతం వినిపించింది. నృత్యం జరుగుతున్నంతసేపు నాగసుందరి మన స్వా

పాట మైకంతో నాగుపాము పడగై పరవశించింది.
ఆపైన తన నృత్యపూజ ముగించుకుని ఆపిల్లనగ్రోవి సవ్వడి వినవచ్చినవైపు వెళ్ళింది.
అక్కడ ఒక కోడెప్రాయపుగొల్ల అడివిలో ఆలమంద మేపుగుంటూ ఒక పొదరింట రాతితిన్నెమీద ఓరగా ఒరిగి కూర్చుని, పట్టరాని ఆనందతన్మయతతో మురళి మ్రోగిస్తున్నాడు. అతని పేరు పైడిమువ్వ. అమాయిక సుందరమయిన అతని ముఖము, కుచ్చు తలపాగా, వెడద ఎడద, మెడలో గురివెంద పేరులు నాగసుందరి కింకరెప్పపాటే లేకుండా చేసివేశాయి!
మరికొంత కాలానికి వారిరువురిమధ్య ప్రగాఢమయిన ఆత్మీయత పేరుకున్నది. 'ఆహా! ఆ గోపీమనోహరుడే నా బిగికౌగిలింతలో చిక్కుకున్నాడు కాబోలును! నా పూజ నేటి కీ విధంగా ఫలించింది కాబోలును!' అని ఉప్పొంగి పోయింది నాగసుందరి. అయితే ఆమె వ్యవహారం తన చెల్లెళ్ళ కేమాత్రము తెలియనియ్యలేదు. ఆ రహస్యం మరి ఇతరుల కెవ్వరికి తెలియనియ్యకుండా వారిద్దరు మిక్కిలి గుంభనగా వ్యవహరించారు. లోకంలో సంతోషం అంతా తమ కౌగిలింత సొమ్మయినదని మురిసిపోయారు! కాని వారి ఆనందం చిరకాలం కొనసాగలేదు!
ఒకనాడామె తన సంధ్యా నృత్యం ముగించుకుని పైడి మువ్వకోసమని కొంతదూరంలో ఉన్న పొదరింటికి బయలుదేరింది. తొందర తొందరగా అక్కడికి చేరుకుని తన కళ్ళఎదుట జరుగుతున్న దారుణ దృశ్యం గమనించి నిలువునా నేలమీద కూలబడిపోయింది.
మొలలో ఉన్న ఒక చిన్న బాకుతో అతడకస్మాత్తుగా మీది కురికిన ఒక బెబ్బులితో తలపడి పోరాడుతున్నాడు! కాని మరికొన్ని క్షణాలలోనే అతని బాకు పోటులతో మరింతగా రెచ్చిపోయిన ఆ పెద్దపులి మీది కురికి పంజాతో అతన్ని దారుణంగా చావమోదింది! ఆ తీవ్రాఘాతంలో మరణించిన అతని మెడ నోటితో కరిచిపట్టి, ఒకే ఒక్క చెంగలింపుతో సాంద్రాటవి మధ్యలో అదృశ్యమయింది!
మరికొంత సేపటివరకు నాగసుందరికి తిరిగి స్పృహ లేదు.

ఆ పైన అక్కడే అలాగే కూలబడి కన్నీరు మున్నీరుగా విలపించింది. అటుపిమ్మట మరికొన్ని వారాలకు ఆమె తన నృత్య సంగీతాల మాటే తలపెట్టలేదు.

మరికొంత కాలం గడిచిన తరవాత నాగసుందరి గుహా మధ్యంలో తపశ్చర్యలో మునిగిన ప్రవాళస్వామిని సందర్శించింది. గోలుగోలున విలపిస్తూ తన గోడంతా వెళ్ళబోసుకుని దగ్గుత్తికతో ప్రశ్నించింది.

"స్వామీ, తమ కీ జీవిత రహస్యం అంతా కరతలామలకమే గదా! నా పైడి మువ్వ ఏమయినాడు? ఎక్కడికి తరలిపోయినాడు!"

ఆవిధంగా రెండు మూడు సారు లడిగిన పిదప ప్రవాళస్వామి చల్లని పలుకులతో ఆమె నోదార్చాడు.

"నాగసుందరీ! నీ వీవిధంగా దుఃఖిస్తే మాత్రం ప్రయోజన మేమిటి? గోపికాగీతిక పాడుకుంటూ అత డలాగే ఆ నల్లనయ్యలో లీనమయిపోయాడు!"

"తిరిగి నే నీ జన్మలో అతణ్ణి కళ్ళారా చూడగలనా?"

ఉప్పొంగుతున్న ఆత్రుతతో ప్రశ్నించింది నాగసుందరి.

"ఆఁ. తప్పక చూడగలవు!"

"ఎలాగ? ఎక్కడ?"

మరింత ఆత్రంగా అడిగింది నాగసుందరి.

ప్రవాళస్వామి ఉసూరుమని నిశ్వసించాడు.

"నృత్యంలో నిత్యము ఆ గోపాలమూర్తిని కొలుచుకుంటే. ఎప్పటికయినా ఆ ప్రేమపెన్నిధిలో నీ పైడిమువ్వ అచ్చంగా నీవు చూచినట్టే సాక్షాత్కరించగలడు! సందేహంలేదు!"

"అయితే ఆ గోపాలమూర్తి ఎక్కడ ఉన్నాడో? దయచేసి చెప్పండి!"

నాగసుందరి ఇనుమడించిన ఆత్రుతతో ప్రతిమాలుకున్నది.

"నీవు ప్రతిదినము నృత్యం చేస్తున్న ఆ మంటిగుట్ట కెదురుగా భూగర్భదేవాలయంలో ఉన్నాడు. క్రమక్రమంగా నీ భక్తిశ్రద్ధల

వల్ల, నృత్యగానాదులవల్ల ఆ దేవాలయం బయటపడి ఆ గోపాల కృష్ణదేవుడు ప్రతిమారూపంలో సాక్షాత్కరించగలడు. మరికొంతకాలాని కా గోపీ మనోహరుడే కాక, అతని గుండెలో నీపైడిమువ్వకూడా ప్రత్యక్షంకాగలడు! సందేహంలేదు!''

* * *

నాగసుందరి ఆగాథ అంతా చాలా సంగ్రహంగా, అవసర మయినచోట వ్యంగ్యంగా చక్రవర్తి కత్యంత వినయంతో విన్నవిం చింది. తన మన స్సెల్లవేళల ఆపైడిమువ్వ మీదనే నిలిచిఉన్న దన్నది. అందుచేత అంతఃపుర ప్రవేశానికి తన కెంతమాత్రము అర్హత లేదని నివేదించింది.

అయినా లలితాదిత్యు డంతమాత్రంచేత నిరుత్సాహ పడలేదు!

"నాగసుందరీ, నీవు తప్పకుండా నా కోరిక నెరవేర్చగలనని మాట ఇచ్చావు కదా! ఆ మాట తప్పడం న్యాయమేనా?''

కొంచెం బ్రతిమాలుకుంటున్నట్టు ప్రశ్నించాడు చక్రవర్తి. ఆమె శిరస్సు రవంత కిందికి వంచి వేసుకున్నది.

"మహాప్రభూ! నేను నా మాట తప్పడంలేదు! మీరు కాదు కూడదంటే ఇదిగో, ఇప్పుడే మీరాణివాసంలో ప్రవేశించగలను! కాని నా మనస్సెల్లవేళల ఆపైడి మువ్వనే తలుచుకుంటున్నదని అన్నాను కదా!....పంచరంగుల రామ చిలక లేకపోయిన తరవాత, బంగారు పంజరం చేజిక్కితే మాత్రం మీవంటి సార్వభౌములకేమిటి ప్రయో జనం! అయితే ఒక్కమాట! మీరు నా కనుమతి దయచేస్తే నేని క్కడ నా నృత్య గోష్ఠి కొనసాగించుకోగలను. అంతేగాని నే నిచ్చిన మాట మాత్రం తప్పదలుచుకోలేదు! నేను మీ కెన్నటికి ఋణగ్రస్తు రాలినే! సందేహంలేదు! ఆపైన తమ చిత్తం!"

అయినా చక్రవర్తి తన పట్టు విడిచిపెట్ట దలుచుకోలేదు.ఆమె ఎలాగయినా ఆ అరణ్యం మధ్యం నించి బయటపడితే నేడు కాక పోతే రేపటికయినా తన మాట కాదనదని ఆలోచించాడు. చల్లగా తన ఆలోచన బయట పెట్టాడు.

"నాగసుందరీ, పోనీ, నీవు మా ఆస్థాన నర్తకిగా ఉండ కూడదా!"

నాగసుందరి కొంచెం సేపాలోచించి, రవంత శిరస్సు వంచుకున్నది.

"సార్వభౌమా! సంగీతనృత్యాది కళలన్ని ఆ శ్రీకృష్ణ దేవుని పాదయుగళి పైడిమువ్వలనుండే ప్రాదుర్భవించాయి. అందువల్ల అవి తిరిగి ఆ నృత్యమోహన మూర్తికే సమర్పించవలసిఉన్నది. కీర్తి ప్రతిష్ఠలకోసము, ధన ధాన్యాలకోసము అవి వినియోగిస్తే చివరికది కేవలం ఆత్మవంచనగానే పరిణమిస్తుంది. అదీగాక తమ పూర్వులిచ్చిన మడిమాన్యాల మీదనేకదా మా మనుగడ కొనసాగుతున్నది? ఇందువల్ల ఎల్లవేళల నేను మీ ఆస్థాన నర్తకి నన్నమాటే గదా! అయితే నా కా గోపీవల్లభుని సమక్షంలోనేకాక వేరెక్కడ గజ్జె కట్టాలని లేదు....కాని మీ కోరిక తిరస్కరించాలని కూడా లేదు....! కాని...."

లలితాదిత్యుని కా సమాధానం బొత్తిగా రుచించలేదు.

"నాగసుందరీ! నేనొక మెట్టు దిగి వచ్చానుకదా! కనక నీవింక నా కోరిక కాదనడం న్యాయంకాదు....నీ వింతగా మాట తప్పించే దానవని నేననుకోలేదు! తప్పక నా మాట పాటించి తీరవలిసిందే!"

నర్తకి రవంత నవ్వు ముఖంతో తిరిగి బదులు పలికింది.

"నేను మీమాట కెదురాడడంలేదు! అయితే మీకొక్క విచిత్ర రహస్యం వెల్లడించవలిసి ఉన్నది. ఇన్నాళ్ళనించి మీ కామాట చెప్పలేదు. మీ రా రహస్యం విన్నాకకూడా నన్ను ఆస్థాన నర్తకిగా నియమించ దలచుకుంటే నేను మరి కాదనను. రేపు కృష్ణాష్టమి కదా! రేపే మీకది వెల్లడించి, మీ అనుమతి మీదనే నే నా స్వామి సమక్షంలో గజ్జె కట్టుకుంటాను. సరికదా!"

లలితాదిత్యునికి రవంత సంతోషం కలిగింది. రెట్టించిన ఆత్రతతో ప్రశ్నించాడు.

"ఆ పరమరహస్యమేదో నేడే బయటపెట్టకూడదా?"

"రేపా నవనీతచోరుని జన్మదినంకదా! రేపటినించి మీ అంగీ

కారంతోనే నేనింక నా కొత్త మనుగడ కొనసాగించాలని ఉవ్విళ్లూరు తున్నాను. అంతలోనే ఇంత తొందరేల? ఒక్కనాటికి ఓరిమి వహించలేరా?"

ఆసమాధానంతో లలితాదిత్యుని కేదో కొత్త ఆశ తళుక్కుమని మెరిసినట్లు స్ఫురించింది.

మరునాటినించి తన కోరిక నెరవేరేటట్లు ప్రయత్నించి తీరా లని నిశ్చయించుకున్నాడు. ఆపైన నాగసుందరి సమాధానంలో కూడా అతనికేదో కొత్త ఆశ గోచరించింది. అందుచేత ఆనాటి కా ప్రార్థన కంగీకరించి తిరిగి శ్రీనగరానికి మరలిపోయాడు.

* * *

ఆ మరునాటి నృత్యోత్సవానికని నాగసుందరి అంతకు మును పెన్నడులేనంతటిమహోల్లాసంతోఅలంకరించుకున్నది.నృత్యంప్రారం భించే ముందామె శ్రీకృష్ణ దేవుని మురళి కలంకరించిన సురపొన్న పూల మాలిక ఒకటి తీసి, లలితాదిత్యుని గళంలో అలంకరించి, నగ వుతో తన రహస్య కథనం ప్రారంభించింది.

"సార్వభౌమా! బహు పురాతన కాలంలో ఈ దేవళాలు మూడు నిర్మించిన ప్రభువులు మీరే! అప్పుడీ శ్రీకృష్ణ దేవాలయంలో నన్ను దేవదాసిగా ఏర్పరచినవారు కూడా మీరే. అంతకుమునుపు కూడా నేను మీ ఆస్థాన నర్తకినే! మన అనుబంధం నేటిదికాదు. బహుపురాతనకాలం నాటిది. అయితే భోగభాగ్యాల మీది వెర్రి మమ కారంతో నేనప్పుడంతగా భక్తి శ్రద్ధలతో స్వామిని సేవించుకోలేదు. కనుకనే నే నీ విధంగా తిరిగి జన్మించాను.....అదీగాక భోగభాగ్యాల మీదగాని, కీర్తి ప్రతిష్ఠలమీదగాని, ధనధాన్యాదుల మీదగాని నా కాసక్తి లేదు. ఆపైన నా భావిజీవితం పూర్తిగా శ్రీకృష్ణ దేవుని పాద పూజకే నిర్దిష్టమయినదని కూడా తెలిసింది...."

"ఈ పూర్వ జన్మ గాథ లన్ని నీకెలాగ తెలిశాయి?"

చక్రవర్తి కొంత విసుగుదలతో ప్రశ్నించాడు.

"ప్రవాళస్వామివల్ల! ఇటీవలే నా కీ రహస్యం వెల్లడించా రాయన! ఇది అంతా మీరే వారి నడిగి తెలుసుకోవచ్చు."

చక్రవర్తి కాపైన నాగసుందరి మాట మీద అపనమ్మకం కలగలేదు. పట్టరాని ఆశ్చర్యంతో అతని హృదయం రవంతసేపు స్తంభించింది.

"అయితే పైడిమువ్వ, ప్రవాళస్వామి కూడా పూర్వ జన్మలలో మన జీవితాలతో బాగా ముడిపడినవారేనా?"

"అవును! ప్రవాళస్వామివల్లనే నా కీవిషయాలన్నీ తెలిశాయి. ఆయన ఆ పురాతనకాలంలో ఈ దేవాలయం పూజారి!"

"మరి పైడీ మువ్వ?"

"ఆ పూర్వ జన్మలో నా నృత్యాచార్యుడు!"

చక్రవర్తి కా క్షణంలో ఒక సరికొత్త లోకంలో ప్రవేశించిన ట్టయింది! ఆ విచిత్ర విషయాలన్నీ ఆలోచిస్తూ అలాగే నిర్ఘాంతపడి నిలుచున్నాడు. అంతలోనే నాగసుందరి తిరిగి అందుకున్నది.

"నేను చెప్పిన విచిత్ర రహస్యం విన్నారుకదా! మరి మీసెల వేమిటి? ఇక మీమాట కాదనదలుచుకోలేదు? నన్ను మీ అస్థానానికి రమ్మని సెలవా?"

చక్రవర్తి ఆమెవైపు చూచి మరి కొంతసేపాలోచించి నవ్వు ముఖంతో అనుమతించాడు.

"నీవొక దివ్య పారిజాత మాలికవు నాగసుందరీ! నేనిది గ్రహించుకోలేక నా మెడలో మాలికగా అలంకరించుకోవాలని ఉబలాటపడ్డాను. ఇకనించి నీ వా శ్రీకృష్ణదేవుని అస్థానంలో మహనీయ నర్తకివి! నేను కేవలం నీ అనుచరుడను మాత్రమే."

"సార్వభౌమా! తామంతటిమాట అనరాదు!"

నాగసుందరి దరహసితంతో తటాలున లలితాదిత్యుని పాదాలపై వాలి నమస్కరించి, వరద వెల్లువలా ఉవ్వొంగుతున్న ఉత్సాహంతో శ్రీకృష్ణుని సమక్షంలో తన పూజా నృత్యం ప్రారంభించింది.

అనాడామె అపూర్వావేశం గమనించి, శ్రీకృష్ణదేవుని సజీవ చైతన్యమూర్తి సాక్షాత్కారంతో బాటు, పైడిముప్వ ప్రత్యక్ష సాన్నిధ్యం కూడా సాధించినదని గ్రహించుకున్నాడు చక్రవర్తి. అంతేకాదు! పైడిముప్వ దారుణమరణంతో బయలుదేరిన తీవ్ర వేదన వల్లనే ఆమె అంతటిమహనీయ నర్తకి కాగలిగినదని కూడా నిశ్చయించుకున్నాడు.

అనాడామె ముఖతః విన్న విచిత్ర రహస్యాన్ని గూర్చి ఆలోచించిన కొద్దీ అతనికి తన జీవితం అంతా అత్యద్భుత స్వప్నంలా స్ఫురించింది.

అరమోడ్పు కన్నుగవతో గోపాలకృష్ణునిపై ఏకాగ్ర దృష్టి నిలిపి,ఆనంద తన్మయతతో మైమరిచి నృత్యం చేస్తున్న నాగసుందరి పెదవిపై ఎడతెగని చిరునవ్వు గమనించి అతిశయించిన గౌరవదృష్టితో అంతర్యంలో పుష్పాంజలి ఘటించి ఎంతో ఆప్యాయంగా అభినందించాడు కాశ్మీర చక్రవర్తి.